రైల్వే కుటుంబాలకు చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న రైల్వే క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు

సికింద్రాబాద్: ఇటీవల మృతి చెందిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు బుధవారం వాటాధనాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఎలక్ట్రికల్ విభాగం ఉద్యోగి వెంకటస్వామి అనారోగ్యంతో, సీఎంఎస్ విభాగం ఉద్యోగి కే.నారాయణస్వామి ప్రమాదం బారిన పడి కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. వెంకటస్వామి పేరిట సొసైటీ రుణం రూ. 10 లక్షలను రద్దు చేసి వాటాధనం రూ.2.67 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందించారు.అలాగే నారాయణస్వామి రుణం రూ. 6లక్షలు మాఫీ చేసి, వాటా ధనం రూ.2.90 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, వర్క్‌షాప్ డివిజన్ కార్యదర్శి బుచ్చిరెడ్డి, సొసైటీ ప్రతినిధులు డి.కుమార్, దత్తాత్రేయ, రాధ, బాలకష్టారెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

కాచివడబోసిన నీటినే తాగాలి



సుభాష్‌నగర్‌లో నీటిని పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

అమీర్‌పేట: ఈ వర్షాకాలంలో మంచినీటిని కాచి వడబోసి తాగాలని జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్ పిలుపునిచ్చారు. వర్షాకాలంలో కొత్త నీరు సరఫరా సరఫరా అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని బీకేగూడ, సుభాష్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి సరఫరా అవుతున్న మంచినీటి గ్రావిటీని పరిశీలించారు. సురక్షితమైన నీటి గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటి జనరల్ మేనేజర్ వంశీ కృష్ణ, లైన్‌మెన్లు శ్రీనివాస్,ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రసూల్‌పురా: గణేష్ నవరాత్రులను, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. బుధవారం కంటోన్మెంట్ టివోలీ గార్డెన్‌లో భాగ్యనగర్ ఉత్సవ సమితి, మండప నిర్వహాకులతో నార్త్‌జోన్ పోలీసుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని అన్నారు. మండపంలో ఏర్పాటు చేస్తున్న గణేష్ ప్రతిమ ఎత్తు, నిమజ్జన తేది వివరాలను పోలీసుల వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ డాక్టర్ పి. అశోక్. బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణ గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య పాల్గొన్నారు.

లాలాపేటలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో బొడ్రాయి(శీతలాదేవి) ప్రతిష్టాపన మొదటి వార్షికోత్సవం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాపేట గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ నాయకులు వంజరి ముత్యాలు, మల్లేష్ పాల్గొన్నారు.

సిమెంట్ స్తంభాల ఏర్పాటుకు కృషి

సనత్‌నగర్: నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ తెలిపారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో తుప్పు పట్టి ఉన్న ఐరన్ స్తంభాల మూలంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా వాటి స్థానంలో సిమెంట్ స్తంభాల ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, రాజేశ్వరి, అర్బతుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే టీచర్లుగా...!

ఓయూ మోడల్ స్కూల్‌లో గురుపూజోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఓయూ మోడల్ స్కూల్‌లో విద్యార్థులే టీచర్లుగా స్వయం (సెల్ఫ్ గవర్నమెంట్ డే) పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం విద్యార్థులు టీచర్లుగా తరగతి గదిలో బోధనతో గడిపారు. వివిధ సబ్జెక్టుల టీచర్లుగా, ప్రధాన ఉపాధ్యాయులుగా వ్యవరించారు. మోడల్ స్కూల్ హెచ్‌ఎం జ్యోతిశ్రీ తదితరులు పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన పి.ఖాలి బాయ్ కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను బుధవారం పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బాపూనగర్ అధ్యక్షులు హరిసింగ్ జాదవ్,గొలుసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యం



రమేష్

రసూల్‌పురా: వాకింగ్‌కు వెళ్ళిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. తిరుమలగిరి ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు.. జూపీటర్ కాలనీలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి సి. రమేష్ కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఈనెల2న ఉదయం వాకింగ్ వెళ్ళి తిరిగిరాలేదు. స్నేహితుల బంధువుల ఇళ్ళల్లో కుటుంబసభ్యులు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి తిరుమలగిరి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనం.. 'ప్రత్యేకం'

- నిమజ్జనోత్సవాలకు జీహెచ్‌ఎంసీ భారీ ఏర్పాట్లు
- రూ.24 లక్షల వ్యయంతో పాండ్స్ నిర్మాణం

సికింద్రాబాద్: గణపతి నిమజ్జనాల కోసం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు ఫీట్ల వరకు ఎత్తు కలిగిన విగ్రహాలను హుస్సేన్‌సాగర్ వైపు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వాటన్నింటినీ ఇక్కడే నిమజ్జనం చేసేందుకు పాండ్స్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో బుధవారం రూ. 24 లక్షల వ్యయంతో పాట్ నిర్మాణం పనులు ప్రారంభించారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ డివిజన్ల పరిధిలోని మండపాల వద్ద సుమారుగా ఐదు వందల చిన్నపాటి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వీటన్నింటినీ చిలకలగూడ మైదానంలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగో రోజు నుంచే.....

ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించిన చిన్నపాటి, ఓ మోస్తరు విగ్రహాలను నాలుగో రోజు నుంచే నిమజ్జనాలు చేయాలని చిలకలగూడ డివిజన్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. విగ్రహాల సైజులు, మండపాల ఏర్పాటు ప్రాతిపదికన ఉత్సవ నిర్వాహకులు ఏ రోజున ఎక్కడ నిమజ్జనం చేయాలన్న విషయమై పోలీసులుస్పష్టతనిస్తున్నారు.



చిలకలగూడ మున్సిపల్ మైదానంలో నిమజ్జన పాండ్స్ నిర్మాణ పనులు

రెండు పాండ్ల నిర్మాణం...

చిలకలగూడ మున్సిపల్ మైదానంలో వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం రెండు వేర్వేరు నమూనాల పాండ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి నుంచి మూడు ఫీట్ల సైజు కలిగిన విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడీమేట్ పాండ్‌ను మైదానం పైన అమర్చుతున్నారు. నాలుగు నుంచి ఐదు ఫీట్ల వరకు సైజు కలిగిన విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు మాత్రం ప్రత్యేక పద్ధతి ద్వారా పాండ్స్ నిర్మాణం చేస్తున్నారు. ఇందుకోసం 10 ఫీట్ల లోతు త్వకాన్ని చేపట్టి అందులో నీటిని నిల్వ ఉంచుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన మినీక్రేనును అందుబాటులో ఉండి, విద్యుత్ దీపాలు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు తెలిపారు.

ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

సనత్‌నగర్: ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5.70 లక్షల విలువైన ఆర్థిక సహాయ పత్రాల (ఎల్‌ఓసీ)ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు హరిసింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఇరువురిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న అఖిల భారత గో రక్షణ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గజాధర్ కులారియా, అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ రాష్ట్ర జెమ్స్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్ ప్రసాద్ వర్మలను పరామర్శించారు.



జగదీష్‌వర్మ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ట్రావెల్స్ బస్సులను సిటీలోకి అనుమతించాలి

లాలాపేట: భారీ వాహనాలకు నో ఎంట్రీ సమయంలో సైతం ట్రావెల్స్ బస్సులను సిటీలోకి అనుమతించాలనీ తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బధవారం అసొసియేషన్ నాయకులు నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రసిడెంట్ గోపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నర్సింహ్మారెడ్డి, సోమయ్య, కొండల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి,ఉపేందర్ తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



అడ్డగుట్ట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వీరు హాజరయ్యారు. ఆర్బీఎస్‌కే బృందం, స్కూల్ హెచ్‌ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నాలాపై నిర్మాణాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో హైడ్రా అధికారులు పలు నిర్మాణాలను పరిశీలించారు. బుధవారం తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్ వద్ద హస్మత్‌పేట్ చెరువు నాలా పై నిర్మించిన నిర్మాణాలను ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య, డీసీపీ రాంరెడ్డి, ఏఈ రోహిత్‌లతో కలసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. తిరుమలగిరి నాలాపై ఉన్న రోడ్డు, స్లాబ్ నిర్మాణం చేపట్టారన్న విషయమై ఆరా తీయడంతో పాటు వాటిపై ఉన్న నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 104 సర్వే నంబర్‌లో నాలా ఉన్నట్లు గుర్తించడంతో పాటు నాలాపై నిర్మాణాలు ఎలా చేపట్టారన్న విషయాలను గార్డెన్ నిర్వాహకులు రాఘవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అధికారులను నాలాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

మన ఉత్పత్తులు అంతర్జాతీయ గుర్తింపు పొందాలి

మంత్రి శ్రీధర్‌బాబు



స్వదేశీ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సనత్‌నగర్: మన ఉత్పత్తులను ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ జరిగేలా కళాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. స్వావలంబి భారత అభియాన్ ఆధ్వర్యంలో స్వదేశీ జాగరణ మంచ్ పేరుతో అక్టోబర్ 23 నుంచి 27 వరకు పీపుల్స్ ప్లాజాలో జరిగే స్వదేశీ మేళా సన్నాహక కార్యక్రమం బేగంపేటలోని హరితాప్లాజాలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందిరా మహిళా శక్తి పేరుతో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలకు సంబంధించి మినీ ఇండస్ట్రీలను ఏర్పాటుచేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి, ప్రొఫెసర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వదేశీ మేళా పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

బీసీ నేతల ఆమరణదీక్షపై ప్రభుత్వం స్పందించాలి

గాంధీఆస్పత్రి : న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీసీ నేతలు కొనసాగిస్తున్న ఆమరణదీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. గాంధీఆస్పత్రిలో ఆమరణదీక్ష కొనసాగిస్తున్న బత్తుల సిద్ధేశ్వర్‌ను బుధవారం ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ నేతలు ప్రాణాలకు తెగించి ఆమరణదీక్ష చేపడితే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి బీసీ నాయకుల దీక్షలను విరమింపజేయాలని కోరారు.



సిద్ధేశ్వర్‌ను పరామర్శిస్తున్న లక్ష్మణ్

చెన్నైలో సికింద్రాబాద్ విద్యార్థి ఆత్మహత్య

సాక్షి, చెన్నై: చెన్నైలో సికింద్రాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నై శివారులోని కాటాన్ కొళత్తూరులో సికింద్రాబాద్‌కు చెందిన శ్రీనివాస్ నిఖిల్ (20) ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతూ స్థానికంగా ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. వీకెండ్‌లో విచ్చలవిడిగా గంజాయి, మాదక ద్రవ్యాల మత్తులో విద్యార్థులు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో తాంబరం కమిషనరేట్ పోలీసులు శనివారం సోదాలు నిర్వహించారు. విద్యార్థుల నుంచి గంజాయి, హుక్కాతో పాటు వివిధ రకాల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మరై మలర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని కటకటాలలోకి నెట్టారు. 20 మందికి పైగా విద్యార్థులను అదుపులోకి తీసుకుని హెచ్చరించి పంపించేశారు. పోలీసులకు పట్టుబడ్డ వారిలో శ్రీనివాస్ నిఖిల్ (20) కూడా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఫోన్‌లో ఎవరితోనో గట్టిగా అరుస్తూ మాట్లాడుతూ వచ్చిన నిఖిల్ హఠాత్తుగా ఫోన్‌ను నేలకేసి కొట్టి అపార్ట్‌మెంట్ 4వ అంతస్తు నుంచి కిందకు దూకేశాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆస్పత్రికి తరలించగా, అర్ధరాత్రి వేళ మరణించినట్టు పోలీసులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం కేసు నమోదు చేసిన మరైమలై నగర్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ ఏసీపీగా నర్సింగ్‌రావు

పద్మారావునగర్: జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా నర్సింగ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏసీపీ క్రిష్టఫర్ ఆకస్మికంగా మరణించారు. దీంతో ఉన్నతాధికారులు నర్సింగ్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గురువారం ఏసీపీ నర్సింగ్‌రావు విలేకరులతో మాట్లాడారు. నూతన భవనాల అనుమతులను త్వరితగతిన మంజూరు చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలను అరికడతామన్నారు.

7 నుంచి నవరాత్రి మహోత్సవాలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 16 వరకు వినాయక నవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న కలశస్థాపన, గణేష్‌పూజ, బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావుచే 'ప్రవచనాలు, 8,9 తేదీలలో భరతనాట్య ప్రదర్శన, 10న కూచిపూడి నృత్య ప్రదర్శన, మ్యాజిక్ షో, 11న కూచిపూడి నృత్య ప్రదర్శన, 12న అన్నమయ్య సంకీర్తనలు, 13న శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, అన్నమయ్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యం, 14న సంగీత నృత్య విభావరి, 15న సాంస్కృతిక కార్యక్రమాలు, లడ్డూ వేలంపాట, 16న ఆధ్యాత్మిక ప్రసంగాలు, అన్నదానం, శోభాయాత్ర ఉంటాయన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి

గాంధీఆస్పత్రి : బీసీల హక్కులపై కాలయాపన చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే నష్టమని బహుజన సమాజ్ పార్టీ ఏపీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర పూర్ణచంద్రరావు హెచ్చరించారు. కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కోసం హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ చేపట్టిన ఆమరణ దీక్ష 11వ రోజైన బుధవారం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో కొనసాగింది. సిద్ధేశ్వర్‌ను పరామర్శించి సంఘీభావం ప్రకటించిన అనంతరం పూర్ణచంద్రరావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

నలుగురికి బెస్ట్ టీచర్ అవార్డు

లాలాపేట : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరిస్తుంది. ఈ సంవత్సరం హైదరాబాద్ జిల్లా స్థాయిలో మారెడుపల్లి మండల పరిధిలో మొత్తం ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రభుత్వ బాలికల పాఠశాల (మార్కెట్ స్కూల్ లాలాపేట) గణిత ఉపాధ్యాయురాలు కె.ఎస్ వైశాలి. లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గడిస్కూల్)కు చెందిన బయలాజికల్ సైన్స్ టీచర్ దేవేందర్‌రెడ్డి. చంద్రబాబునగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఇందిర, లాలాపేట ప్రభుత్వ పాఠశాల నుంచి ఇటీవలే రిటైర్ అయిన ఎస్‌జీటి టీచర్ బి. గీతాకుమారి ఎంపికయ్యారు.

ఉస్మానియా యూనివర్సిటీలో...

ఉస్మానియా యూనివర్సిటీ: గురుపూజోత్సవం సందర్భంగా యూనివర్సిటీల ఉత్తమ అధ్యాపకులుగా ఓయూ నుంచి నలుగురు ప్రొఫెసర్లను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, ఆర్ట్స్ కాలేజీ తెలుగుశాఖ అధ్యాపకురాలు ప్రొ.సూర్యధనుంజయ్, టీజీసెట్-2024 సభ్య కార్యదర్శి, కామర్స్ అధ్యాపకులు ప్రొ.గడ్డం నరేష్‌రెడ్డి, ఓయూ బయోమెడికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు డాక్టర్ కేఈసీహెచ్ విద్యాసాగర్‌లు ఎంపికయ్యారు. నేడు (5న) రవీంద్ర భారతీలో జరిగే గురుపూజోత్సవం కార్యక్రమంలో ఉత్తమ అవార్డులను అందుకోనున్నారు.

నేడు మట్టి గణనాథుల విగ్రహాల పంపిణీ

బన్సీలాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ మట్టి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. సికింద్రాబాద్‌లో పలు ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి జీహెచ్‌ఎంసీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 5 నుంచి మట్టి విగ్రహాలను పంపిణీకి శ్రీకారం చుట్టింది. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో సుమారు 9 వేల గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య చెప్పారు. ప్రతి డివిజన్‌కు 2,300 చొప్పున మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. బన్సీలాల్ పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లలో ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. గురువారం ఉదయం చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్, సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం, బేగంపేట్ మయూర్ మార్గ్, రెజిమెంటల్ బజార్ ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు డీసీ సమ్మయ్య వివరించారు.

త్వరలో పాలిటెక్నిక్ కాలేజీల ఆధునీకరణ

ఎమ్మెల్యే శ్రీగణేశ్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: 50 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాలను ఆధునీకరించి, సకల సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీల ఆధునీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మారేడుపల్లిలోని రెండు పాలిటెక్నిక్ కళాశాలల సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అన్నపూర్ణ, వినోద్, సిబ్బంది, విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఒక్కో కోర్సులో 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 66కు పెరిగిందని అధ్యాపకులు ఎమ్మెల్యేకు వివరించారు. తదనుగుణంగా అదనపు తరగతి గదులు, నూతన భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 1,800 విద్యార్థులు కలిగి ఉన్న కళాశాలలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. బాలురు, బాలికల హాస్టల్స్‌ను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలికలతో కలిసి భోజనం చేసి, సదుపాయాలు, సమస్యలపై ఆరా తీశారు.

ఘనంగా సరస్వతీ పూజ

లాలాపేట: తార్నాకలోని శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం సరస్వతీ దేవి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఏజీఎం మహమ్మద్ ఆలీ పాల్గొన్నారు.



వేలమంది ఆకలి తీర్చుతున్న అన్నదాన కేంద్రాలు

కంటోన్మెంట్: హిందూ ఆలయాలు నిత్యం వేల మందికి కడుపునింపుతూ అన్నదాన కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని కంటోన్మెంట్ బోర్డ్ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ ఐదోవార్డు మహాత్మా గాంధీ నగర్ లో జరిగిన గురు జగ లింగేశ్వర ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ ఆపద వచ్చినా ముందుగా ఆహారాన్ని అందించి ఆకలి తీర్చేవి దేవాలయాలేనని అన్నారు. వరదల్లో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశీయులకు ఇస్కాన్ ఆలయం అన్నం పెట్టి ఆదుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం విజయవాడ లో వరదల్లో చిక్కుకున్న వారికి కనక దుర్గమ్మ ఆలయ నిర్వాహకులు ఆహారాన్ని అందిస్తూ కడుపునింపుతోందన్నారు. కార్యక్రమంలో ఐదోవార్డు బీజేపీ నాయకులు విజయ్, సోమ శేఖర్ పాల్గొన్నారు.

ఉమేష్ చంద్రకు ఘన నివాళి



అమీర్‌పేట: ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర వర్ధంతి సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అడిషనల్ డీజీ అనిల్‌కుమార్, డీసీపీ విజయ్‌కుమార్, ఏపీ మాజీ డీజీపి గౌతమ్ సవాంగ్ తదితరులు ఎస్‌ఆర్‌నగర్ చౌరస్తాలో ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమేష్ చంద్ర తల్లి దండ్రులు పాల్గొన్నారు.